మొక్కలు నాటితే స్వచ్ఛమైన వాతావరణం



మాజీ ఆర్మీ ఉద్యోగిని సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు



తాళ్లవలసలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఏఎంసీ చైర్మన్ సూర్యనారాయణ

వేడుకగా 'మన మట్టి – మన దేశం', వీరులకు వందనం కార్యక్రమాలు

తగరపువలస: స్వచ్ఛమైన వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు పిలుపునిచ్చారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను ఆయన బుధవారం అమనాం పంచాయతీలో చదివి వినిపించారు. మన మట్టి – మన దేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం గురించి వివరిస్తూ స్వచ్ఛమైన గాలి, నీరు భావితరాలకు అందించడం కోసం మొక్కలు నాటి శిలాఫలకం ఆవిష్కరించారు. తాళ్లవలస పంచాయతీలో భీమిలి ఏఎంసీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ చేతుల మీదుగా ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీడీవో పి.వెంకటరమణ, సర్పంచ్‌లు దంతులూరి ఉమాదేవి, బోని జగ్గమ్మ, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు బోని సన్నిబాబు, పాట్నూరు చంద్రశేఖర్, పీహెచ్‌సీ వైద్యుడు ఏబీ మల్లికార్జునరావు, సచివాలయ, పంచాయితీ, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

నేల తల్లిని, అమరవీరులను మరవరాదు

ఆనందపురం : మనకు తిండిపెట్టిన నేలతల్లిని, దేశ భద్రతను కాపాడుతున్న అమరవీరులను ఎన్నటికీ మరువరాదని జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు అన్నారు. మండలంలోని ఆనందపురం, లొడగలవానిపాలెం పంచాయతీల్లో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా బుధవారం 'మన మట్టి – మన దేశం', నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ దేశ రక్షణలో అమరులైన వారి త్యాగాలను మరువరాదన్నారు. అనంతరం విద్యార్థులు జాతీయ గీతాలను ఆలపించారు. జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేశారు. పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో పాల్గొని పదవీ విరమణ చేసిన మీసాల సత్యంను ఘనంగా సన్మానించారు. చెరువు ప్రాంతంలో మట్టిని సేకరించి మండల కేంద్రానికి అందజేశారు. కార్యక్రమంలో డీపీవో శ్రీనివాసరావు, సర్పంచ్‌లు చందక లక్ష్మి, లొడగల రాజేశ్వరి, ఎంపీడీవో అడపా లవరాజు, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ కరుణాకరరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, నాయకులు రౌతు వెంకటరావు, లొడగల రమణ, కాకర వెంకట రమణ పాల్గొన్నారు

పద్మనాభం: మండలంలోని రెండు పంచాయతీల్లో బుధవారం మన మట్టి – మన దేశం కార్యక్రమాలు నిర్వహించారు. ఐనాడలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, కోరాడలో సర్పంచ్ కోరాడ లక్ష్మణరావు శిలాఫలకాలు ఆవిష్కరించారు. అనంతరం మొక్కలు నాటారు. తదుపరి వీరులకు వందనం చేసి పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో ఎం.విజయకుమార్, ఈసీ తులసి, వైఎస్సార్ సీపీ నాయకులు మామిడి శివరామకృష్ణ, కోండ్రోతు శ్రీనివాసరావు, కోరాడ రామేశ్వరరావు, చందక పైడినాయుడు, ఉపాధి హామీ పథకం వీఆర్పీలు పాల్గొన్నారు.

మధురవాడ: స్థానిక జోనల్ కార్యాలయం వద్ద అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుని, వారి సేవలు కొనియాడారు. జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, సూపరింటెండెంట్ అప్పలరాజు, పలువురు సచివాలయ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అమనాంలో మొక్క నాటుతున్న ఎంపీపీ దంతులూరి వాసురాజు



మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



ఐనాడలో మన మట్టి - మన దేశం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రాంబాబు, తదితరులు

సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్లు దాఖలు



నామినేషన్ వేస్తున్న లచ్చుబుగత జగదీశ్వరరావుతో ఎంపీపీ వాసురాజు, వైస్ ఎంపీపీ బంగారునాయుడు

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ అభ్యర్థులుగా లచ్చుబుగత జగదీశ్వరరావు, అతని భార్య లక్ష్మి బుధవారం భీమిలి ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేశారు. వీరిని వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గాడు తాతినాయుడు బలపరచగా భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్, మాజీ సర్పంచ్ కరుభుక్త జోగినాయుడు తదితరులు హాజరయ్యారు. అలాగే టి.నగరపాలెం 10వ వార్డు అభ్యర్థిగా పూసర్ల రామారావు నామినేషన్ దాఖలు చేశారు. ఈ నెల 19న జరగనున్న ఈ ఎన్నికలకు సంబంధించి నామినేషన్లకు గడువు గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉంది.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



వీరతల్లికి తక్షణ సాయంగా రూ.10 వేలు అందిస్తున్న నాయకులు

తగరపువలస: ఇటీవల క్యాన్సర్‌తో మరణించిన జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు జీరుపేటకు చెందిన చిల్ల శ్రీనివాసరెడ్డి కుటుంబానికి బుధవారం వైస్సార్‌సీపీ నాయకులు వైఎస్సార్ బీమాలో భాగంగా తక్షణ సాయం రూ.10 వేలు అందించారు. బొగ్గురోడ్డు – 2 సచివాలయం పరిధిలో గల శ్రీనివాసరెడ్డి భార్య వీరతల్లికి ఈ మొత్తాన్ని అందించారు. మిగిలిన రూ.90 వేలు ఆమె ఖాతాలో జమ అవుతాయని వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బింగి హరికిరణ్‌రెడ్డి, సరగడ శివాంజనేయరెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి, దల్లి అప్పలరెడ్డి, బోర రాంబాబు, చిల్ల సూర్యంరెడ్డి, వెల్ఫేర్ సెక్రటరీ కల్యాణ్, వలంటీర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 0608 10011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091కు పూజా రుసుం చెల్లించాలి. పేరు, గోత్రనామాలు, 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.



క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ లొడగల అప్పారావు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ వరాహినగర్‌లో రూ.16 లక్షల జీవీఎంసీ నిధులతో ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, రోడ్డు మరమ్మతుల పనులకు బుధవారం వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు శంకుస్థాపన చేశారు. గతంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్‌రావు దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లగా... ఆయన ఆదేశాల మేరకు నిధులు మంజూరవడంతో పనులు ప్రారంభించినట్లు అప్పారావు తెలిపారు.

లైఫ్‌గార్డ్స్ ప్రాణదాతలు



లైఫ్‌గార్డ్స్‌కు రెయిన్ కోట్లు అందజేస్తున్న ఎంపీపీ వాసురాజు

కొమ్మాది: తీర ప్రాంతాల్లో పర్యాటకులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ, విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడుతున్న ప్రాణదాతలు లైఫ్‌గార్డ్స్ అని ఎంపీపీ దంతులూరి వాసురాజు అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు ఐటీ జంక్షన్, రుషికొండ, సాగర్‌నగర్ బీచ్‌లలో విధులు నిర్వహిస్తున్న లైఫ్ గార్డ్స్‌కు బుధవారం ఆయన రెయిన్ కోట్స్ అందజేశారు. పర్యాటకుల ప్రాణాలకు రక్షణ కవచంలా ఉండే లైఫ్‌గార్డ్స్‌కు ప్రస్తుతం వర్షాకాలంలో ఈ రెయిన్ కోట్స్ ఉపయోగకరంగా ఉంటాయని అందజేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని ఆయన తెలిపారు.

బీచ్‌రోడ్డులో వేగ నియంత్రణకు చర్యలు



సాగర్‌నగర్ వద్ద రోడ్డును పరిశీలిస్తున్న ఏసీపీ జాన్ మనోహర్, పోలీస్ సిబ్బంది

కొమ్మాది: బీచ్‌రోడ్డులో వాహనాలు అతి వేగంతో రాకపోకలు సాగించడంతో నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటి వేగ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ ఏసీపీ జాన్ మనోహర్ సిబ్బందిని ఆదేశించారు. బీచ్ రోడ్డు సాగర్‌నగర్ వద్ద సోమవారం రాత్రి జరిగిన ప్రమాద స్థలాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాడిసన్ బ్లూ రహదారి వద్ద స్పీడ్ బ్రేకర్ లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో వేగ నియంత్రణ కోసం అవసరమైన చోట్ల స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. ఆయనవెంట సీఐ ప్రసాద్, ఎస్‌ఐ కుమార్, ఏఈ శ్రీధర్ ఉన్నారు.

పద్మనాభం మండల పాస్టర్ల సంఘ కార్యవర్గం



పద్మనాభం పాస్టర్ల సంఘ కార్యవర్గ సభ్యులు

పద్మనాభం: పద్మనాభం మండల పాస్టర్ల సంఘం అధ్యక్షునిగా రెవరెండ్ కుంచంగి మోజెస్ బుధవారం ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షునిగా రెవరెండ్ కె.పద్మకుమార్, ఉపాధ్యక్షునిగా డి.డేవిడ్‌రాజు, కార్యదర్శిగా రెవరెండ్ కె.కీర్తి దాసు, సంయుక్త కార్యదర్శిగా ఎస్.పాల్, కోశాధికారులగా కె.కాలేబు, వై.స్టీఫెన్‌రాజు, సీనియర్ అడ్వైజర్‌గా దున్న జాన్ విక్టర్ ఎన్నికయ్యారు. కృష్ణాపురం నెతన్య చర్చిలో ఈ ఎన్నిక నిర్వహించారు.

కరాటే పోటీల్లో భీమిలి విద్యార్థులకు పతకాలు



నిర్వాహకులతో పతకాలు సాధించిన విద్యార్థులు

తగరపువలస: నగరంలోని స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 5, 6న నిర్వహించిన 21వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ కరాటే చాంపియన్‌షిప్ – 2023లో భీమిలి విద్యార్థులు సిల్వర్ పతకాలు సాధించారు. వీరిలో 9వ తరగతి విద్యార్థి టి.గుణశేఖర్, ఇంటర్మీడియట్ విద్యార్థి బి.సాయిచరణ్ ఉన్నారు. వీరితోపాటు కోచ్ కర్రి చిట్టిబాబును పీఎస్ఆర్ మార్షల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు, ఆల్ ఇండియా చీఫ్ ఎగ్జామినర్ పి.నరసింహారావు తదితరులు అభినందించారు.

సాంకేతికత ఆధారంగా ఫోన్ గుర్తింపు


- ఫిర్యాదు చేసిన పది నిమిషాల్లోనే బాధితునికి అప్పగింత



ఫోన్‌ను కొండబాబుకు అందిస్తున్న క్రైం ఎస్‌ఐ సూర్యప్రకాశ్

భీమునిపట్నం: ఒక వ్యక్తి ఫోన్ చోరీకి గురైందని ఫిర్యాదు చేసిన పది నిమిషాల వ్యవధిలోనే క్రైం ఎస్ఐ ఎస్.సూర్యప్రకాశ్ కనిపెట్టి అతనికి అందించారు. వివరాల్లోకి వెళ్తే... స్థానిక ఎగువపేటకు చెందిన బొడ్డు కొండబాబు తగరపువలస రోడ్డులోని వుడా మైదానం సమీపంలో తన ద్విచక్ర వాహనాన్ని నిలిపి దాని కవర్‌లో సెల్‌ఫోన్ ఉంచి కొద్ది దూరంలో తెలిసిన వారితో మాట్లాడుతున్నాడు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ అపహరించి పరారయ్యాడు. కొద్ది సేపటి తర్వాత కొండబాబు వచ్చి చూడగా ఫోన్ కనిపించకపోవడంతో క్రైం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ సూర్యప్రకాశ్‌కు ఫిర్యాదు చేశాడు. ఆయన వెంటనే అప్రమత్తమై తన వద్దనున్న ఫైండ్ మై డివైజ్ యాప్ ద్వారా ఫోన్ ఎక్కడుందన్న లొకేషన్‌ను పరిశీలించగా... గొల్లలపాలెం ఆనందవనానికి వెళ్లే దారిలో ఒక లేఅవుట్ వద్ద ఉన్నట్టు తెలిపింది. వెంటనే అక్కడకు వెళ్లగా నిందితుడు కనిపించకపోగా సమీపంలోని పొదల్లో ఫోను లభించింది. దాని సిగ్నల్ ఆధారంగా పరిశీలించి కొండబాబుకు అప్పగించారు. ఫిర్యాదు చేసిన పది నిమిషాల్లోనే ఫోన్‌ను కనిపెట్టిన ఎస్ఐ సూర్యప్రకాశ్‌ను పలువురు అభినందించారు.

రాష్ట్ర స్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీలకు గుడిలోవ విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఆనందపురం : మండలంలోని గుడిలోవ విజ్ఞాన విహార్ విద్యాలయం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి స్కే మార్షల్ ఆర్ట్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 8న మండలంలోని శొంఠ్యాంలో స్కే మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా పోటీల్లో జూనియర్, సబ్ జూనియర్ విభాగంలో బి.ఈశ ప్రకృతి, జ్ఞానశ్రీ, షరిమ్ల, కుందన ప్రియ, లక్ష్మీ వినీల, ఇశాంత్, దిలీప్ కుమార్ ఎంపికయ్యారు. వారు ఈ నెల 13న శ్రీకాకుళంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ మేరకు పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఆర్ఆర్ఆర్ కేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులు



ఆర్ఆర్ఆర్ కేంద్రం వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొమ్మాది: మహా విశాఖ నగరపాలక సంస్థ వ్యర్థాలను వనరులుగా ఉపయోగించడంలో ఎల్లప్పుడూ ముందుంది. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్ (ఆర్ఆర్ఆర్) కేంద్రాన్ని ఇటీవల అభివృద్ధి చేసింది. ఉపయోగించిన లేదా ఉపయోగించని ప్లాస్టిక్ వస్తువులు, దుస్తులు, పాద రక్షకులు, పుస్తకాలు, బొమ్మలు డిపాజిట్ చేయడానికి ఇక్కడి కేంద్రం ఒక సేకరణ పాయింట్‌గా పనిచేస్తోంది. ఈ సందర్భంగా బుధవారం ఆర్ఆర్ఆర్ కేంద్రాన్ని ఎండాడ జిల్లా పరిషత్ స్కూల్ విద్యార్థులు వారి ఉపాధ్యాయులతో కలిసి సందర్శించారు. కేంద్రం పని తీరు, ఉపయోగాన్ని శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి వివరించారు.

పర్యావరణ పరిరక్షణలో ఆదివాసీలు కీలకం

భీమునిపట్నం: పర్యావరణ పరిరక్షణలో ఆదివాసులు తమ వంతు పాత్ర పోషిస్తున్నారని జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా బుధవారం ఇక్కడి ఛాత్రోపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆదివాసులు ప్రకృతి సహజ వనరుల వద్ద నివసిస్తారని, అక్కడి భూములు, పర్యావరణాన్ని పరిరక్షిస్తారన్నారు. అటువంటి వారికి ప్రభుత్వాలు తగిన భూమి హక్కులను కల్పించాలని కోరారు. వైస్ ప్రిన్సిపాల్ గొట్టేటి రవి, అధ్యాపకులు సోమయాజులు, ఎం.మహాలక్ష్మి, జె.మాధవి పాల్గొన్నారు.

అదనపు బాధ్యతలు అప్పగించొద్దని వినతి

మధురవాడ: తమకు అదనపు బాధ్యతలు అప్పగిస్తే ఇబ్బంది పడుతున్నామని, వాటి నుంచి విముక్తి కలిగించాలని పలువురు సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలు వాపోయారు. ఈ మేరకు మధురవాడ జీవీఎంసీ జోన్ – 2 కార్యాలయంలో జెడ్సీ కనక మహాలక్ష్మికి వినతిపత్రం అందించారు. ముఖ్యంగా వార్డుల్లో విద్యుత్ దీపాల నిర్వహణతోపాటు ఇతర పనులు కూడా తమకు అదనంగా అప్పగిస్తున్నారని, వాటి నుంచి మినహాయించాలని కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అప్పలరాజు పాల్గొన్నారు.

వసతిగృహాన్ని మార్చాలని ఆందోళన

భీమునిపట్నం: స్థానికంగా శిథిలమైన ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహాన్ని వేరొకచోటకు మార్చాలని ఆర్డీవో కార్యాలయం వద్ద విద్యార్థులు భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఉమ్మిడి నితిన్ మాట్లాడుతూ ఈ వసతి గృహం పూర్తిగా శిథిలమైపోయిందని, ఇందులో ఎవరూ ఉండే పరిస్థితి లేదన్నారు. కానీ విద్యార్థులు భయపడుతూ ఉంటున్నారని, దీన్ని వెంటనే మరో భవనానికి తరలించకపోతే పెద్ద ప్రమాదం జరిగే పరిస్థితి నెలకొందన్నారు. ఈ సందర్భంగా వారు ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డిని కలవగా మరో భవనానికి విద్యార్థులను తరలిస్తామని హామీ ఇచ్చారు. లొడగల అచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

'మోదీ పాలనలో కార్మికులకు అన్యాయం'

తగరపువలస: ప్రధాని మోదీ గద్దె దిగాలని కోరుతూ క్విట్ మోదీ – సేవ్ ఇండియా నినాదంతో బుధవారం భీమిలి జోన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రైవేట్ మార్కెట్ వద్ద నిరసన తెలిపారు. జోన్ అధ్యక్షుడు ఆర్.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ మోదీ పాలనలో కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదని, తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. సమస్యల పరిష్కారానికి కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. రవ్వ నరసింగరావు, ముగడ ఈశ్వరరావు, రీసు చిన్నారావు, కాకి సురేష్ రిక్క రాము పాల్గొన్నారు.

భూములపై విచారణకు సిద్ధం

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ రెవెన్యూ పాతమూలకుద్దులో భూములపై ఎలాంటి విచారణకైనా సిద్ధమని ఆ గ్రామానికి చెందిన కొయ్య ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన భీమిలి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడుతూ మొత్తం 4.67 ఎకరాల జిరాయితీ పల్లపు భూములు పెద్దల సమక్షంలోనే కొనుగోలు చేశానన్నారు. ఈ భూముల్లో తుప్పలు తొలగించి గట్లు సరి చేయించే పనులకు కొందరు ఆటంకం కలిగిస్తున్నారన్నారు. వీరిపై విచారణ జరిపి తనకు రక్షణ కల్పించాలని పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు.

మూడు పశువుల పాకలు దగ్ధం

పద్మనాభం : మండలంలోని పాండ్రంగిలో గంగిరెడ్ల వారి కళ్లాల్లో మంగళవారం రాత్రి ఒంటి గంట సమయంలో జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు పశువుల పాకలు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. గంగిరెడ్ల కృష్ణ, సూర్యనారాయణ, అప్పలనాయుడు, అప్పలనారాయణకు చెందిన పశువుల పాకలు కాలిపోయాయి. కోళ్ళ, వ్యవసాయ సామగ్రి దగ్ధమయ్యాయి. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, పాండ్రంగి కో – ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు అముజూరి అప్పారావు, మాజీ సర్పంచ్ పల్లి మహేష్ బాధితులను పరామర్శించారు.

సర్పంచ్ పార్వతికి పలువురి నివాళి

తగరపువలస: భీమిలి మండలం మూలకుద్దు సర్పంచ్ కొల్లి పార్వతి చిత్రపటానికి బుధవారం పలువురు నివాళులర్పించారు. ఆమె ఇంటి వద్ద నిర్వహించిన సంస్మరణ కార్యక్రమంలో విజయనగరం జిల్లా నెల్లిమర్ల దుర్గా పీఠాధిపతి శ్రవణ చైతన్యానంద చిన్నస్వామి, వైఎస్సార్ సీపీ భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, పలువురు ప్రజాప్రతినిధులు ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఆమె కుమారుడు కోటిరెడ్డికి అండగా ఉంటామని పేర్కొన్నారు.